
# మొదటి రాత్రి

## డాక్టర్. ఎస్. గంగప్ప

కళా పిపాసువులందరూ 'చిత్ర బహుమతి ఫలితాలకోసం ఎదురుచూస్తున్నారు ఈ బహుమతి తప్పకుండా ఈనాడు చాల ప్రసిద్ధ చిత్రకారుడు ఆర్ ఆర్ రాగులకే వస్తుందని అందరూ ఆశిస్తున్నారు అతి త్వరలోనే ఇది తేలిపోతుందని అనుకొంటున్నారు ప్రముఖాంధ్ర చిత్రకారుడు ఎస్ ఆర్ చిత్రాస్మృత్యర్థం విజయవాడలోని ప్రసిద్ధ పారిశ్రామికవేత్త 'చిత్ర బహుమతిని' ఏర్పాటు చేశాడు ఈ పారిశ్రామికవేత్త ఎస్ ఆర్ చిత్రా దూరబంధువుల్లోనివాడు తన ప్రేయసి పేరు కూడ చిత్ర చిత్ర జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏటేటా బహుమతిని ఇవ్వదలచి 'చిత్రాబహుమతి'ని




స్థాపించాడు వాటర్ కలర్‌లోగాని, ఆయిల్ పెయింట్‌తోగాని చిత్రించిన చిత్రాలను ఎంట్రీకోసం ఆహ్వానిస్తుంది 'చిత్రా బహుమతి సంస్థ వచ్చిన ఎంట్రీలలో ప్రప్రదమ స్థానాన్ని పొందిన చిత్రానికి బహుమతి నిస్తారు ఈ బహుమతి విలువ పదివేల రూపాయల నగదు

ఆర్ ఆర్ రాగుల అప్పటికే ప్రసిద్ధిపొందిన చిత్రాకారుడు స్వదేశీయులైన దామెర్ల రామారావు సి ఎన్ వెంకట్రావు, అడవిబాపిరాజు, ఎస్ ఆర్ చిత్రా జి ఏ పద్మా మొదలైన ప్రముఖ చిత్రకారులు కార్టూనిస్టు తలిశెట్టి రామారావు, భారతీయ చిత్రాకారుడు రవివర్మ, కొంకపల్లి సమకాలిక చిత్రకారులు పి టి రెడ్డి, ఎ పైడిరాజు, కె రాజయ్య మంగళగిరి, జి సత్యం, శేషగిరిరావు, బాపు శంకర్ శీలాలి మొదలైన వారినీ, వారి చిత్రకళా నైపుణ్యాన్నీ ఒడుపులనీ మెళుకువలనీ బాగా గుర్తించిన వాడు ఆర్ ఆర్ రాగుల పైగా భారత ప్రభుత్వం ఏర్పాటుచేసిన పెలోషిప్పుతో బొంబాయి స్కూల్ ఆప్ ఆర్ట్స్ అండ్ ఆర్కిటెక్చర్‌లో సర్వ ప్రదముడుగా ఉత్తీర్ణుడై ఆంధ్రప్రదేశ్‌కే గాక యావద్భారతానికే ఖ్యాతి దెచ్చిన సాటిలేని మేటి చిత్రకారుడు చదువు ముగిశాక ఢిల్లీలో కొంతకాలం చిత్రకళను ప్రాక్టీస్ చేశాడు అది అంతగా నచ్చక మకాం హైద్రాబాద్‌కి మార్చారు

మొదటి నుంచీ దిక్కులేనివారంటే, నిరుపేదలంటే ముదుసలి ముదుకులంటే రాగుల హృదయం కదిలిపోయేది కరుణ రసం పెల్లుబికేది లంబాడీలు కష్టజీవులు నాగరికతంటే తెలియని వాళ్ళు లంబాడీలు అలాంటి లంబాడీల కష్టాన్ని గమనించిన రాగుల లంబాడీ స్త్రీ బొమ్మను చిత్రించి ఆరంభ దశలోనే తన కళాప్రతిబని ప్రకటించినవాడు హైద్రాబాద్ కళాభవన్‌లో ఆంధ్రప్రదేశ్ లలిత కళా అకాడమి ఏర్పాటు చేసిన చిత్రకళా ప్రదర్శనలో ప్రదమ బహుమతికి నోచుకొంది ఈ లంబాడీ లతాంగి చిత్రం దాంతో మేటి చిత్రకారుడుగా రాగులకు పేరు రావడంతో అత్యుక్తిలేదు అదే సందర్భంలోనే లంబాడీ లతాంగి చిత్రాన్ని చూసి ముగ్ధురాలైన ఒక సంపన్న కుటుంబానికి చెందిన నవయువతి తన చిత్రాన్ని చిత్రించమని రాగులను అభ్యర్థించింది ప్రతిఫలంగా ఎంత డబ్బైన ఇస్తానంది కాని ఇది గిట్టని రాగుల తిరస్కరించాడు ఖిన్నురాలై వెళ్ళిపోయింది ఆ యువతి

ఒకానొక ఉదయం రాగుల ఇంటి ముందు ఒక ముదుసలి బిచ్చగత్తె కనిపించింది వంకర టింకరైన పాతకళ్ళజోడు, చాలీ చాలని అతుకుల బొంత పైన ఎడమ చేతిలో ఊతకర్ర కుడిచేతిలో బొచ్చె, గూనువంగి గజ గజ వణికిపోతూంది చూచిన మరుక్షణమే రాగుల ఆ మోడల్‌ని గ్రహించి బొమ్మ చిత్రించాడు చిత్రిస్తున్నంతసేపు అక్కడే ఉండిపోయింది ఆ ముసల్ది తుది మెరుగులకోసం చిత్రాన్ని తన గదిలోకి పట్టుకెళ్ళాడు తానెంతో విజయం సాధించినట్లు భావిస్తూ అదే సమయంలో ఆ ముదుసలి అంతగా వణికి పోతూన్న దల్లా దగ్గర్లోనే ఆగివున్న కారులో ఎక్కి తుర్రున వెళ్ళిపోయింది ఆ ముదుసలి మనిషి టాలూకు సంగతులు ఆరాతీద్దామన్న ఆదుర్దాతో లోపల నుంచి వచ్చాడు రాగల కాని అక్కడ ముసలిదాని ఆచూకీలేదు ఆశ్చర్య చకితుడయ్యాడు తాను హైదరాబాద్‌లో వున్నాడన్నమాటేగాని ఎక్కడో వనస్థలిపుర శివార్లలో ఉంటున్నాడు తానున్న చోట జన సమ్మర్ధంగానీ, సిటీ హడావిడిగానీ ఉండదు ఎంతో ప్రశాంతంగా తన చిత్ర రచనకు ఉపకరించే చోటు అది అక్కడ ఎవరూ లెరు అడిగి తెలుసుకొందామంటే ఉద్విగ్నుడై అలా వుండిపోయాడు ఆలోచిస్తూ

కళాభవన్‌లోని ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడమి పక్షాన ఏటా జరిగే చిత్రకళా ప్రదర్శనలో కళా పిపాసువులు అందరినీ అత్యంతం ఆకర్షించిన చిత్రం 'ముసలిది వార్తా పత్రికలన్నీ దీని విశిష్టతని

సవిమర్శకంగా చాటాయి ఎంతో మంది తనివితీరా ఆ చిత్రాన్ని దర్శించి మెచ్చుకొన్నారు ప్రశంసల- పరంపరలు రాగుల చిత్ర కళానైపుణ్యాన్ని గూర్చి అనేకం వచ్చాయి ఈ సారి గూడా ప్రథమ బహుమతి రాగుల చిత్రం 'ముసలిది'కే దక్కింది అకాడమీ బహుమతితోపాటు ఎందరో చిత్ర కళాభిమానులు ముగ్ధులై ఉడుతాభక్తిగా తమకు తోచినంతగా వ్యక్తిగత బహుమానాలు ప్రకటించారు అదే రీతిని ఓ యువతి తన కోరిక ఈ విధంగా తీరిందనీ, ఈ చిత్రానికి వ్యక్తిగత బహుమతిగా 10వేల రూపాయల చెక్కు సీకరించ వలసిందని రాగులను కోరింది అంతాగుర్తుకుతెచ్చుకొన్నాడు రాగులు అర్ధం చేసుకొన్నాడు క్షణం ఆలోచించి ఓ నిర్ణయాని కొచ్చినట్లు తలూపి ఒక షరతుకు అంగీకరిస్తే తాను బహుమతిని స్వీకరిస్తానన్నాడు రాగుల ఆ యువతి సిద్ధమేనంది తనకు 'మోడల్ గాఉండే పక్షంలో దాన్ని స్వీకరిస్తానన్నాడు చిత్రకళ మీద అభిమానమే- కాదు, అభినివేశమున్న ఆ యువతి అదే మహ- ద్భాగ్యంగా భావించి రెండో ఆలోచన లేకుండానే అంగీకరించింది అతను చెక్కు స్వీకరించాడు ఆ విధంగా ఆ యువతిని మోడల్‌గా చేసి



ఎన్నెన్నో రకాల బొమ్మలు చిత్రించి జాతీయంగానే గాక అంతర్జాతీయంగాను ప్రఖ్యాతి పొందాడు రాగుల

నిరుపేదగా జీవితాన్ని గడుపుతూన్న రాగుల అనుకోకుండా అనంతమైన ఆస్తిపాస్తులకు వారసుడయ్యాడు తన ఆస్తినంతా కాజేయాలన్న తలంపుతో మోసం చేసిన దాయాదులపై కోర్టులో కేసు పెట్టి గెల్చిన తనకు మిగిలిన తాత మరణంతో ఆస్తంతా రాగులకు సంక్రమించింది ఆస్తి అజ- మాయిషీ కోసమైతేనేమి, ఇతర కారణాల వల్లనైతే- నేమి తెలుగు నాడు నడిబొడ్డు అయిన గుంటూరుకు మార్చాడు మకాం రాగుల తన వారంటూ ఎవరూ లేని లావణ్య 'మోడల్'గా ఉండటానికే నిశ్చయించు- కొంది గనుక రాగులతో పాటు గుంటూరు వచ్చేసింది తనకు వలసిన డబ్బు అంతా ఫిక్సెడ్ డిపాజిట్లలో ఉంది తల్లిదండ్రులు వ్యాపారంలో సంపాదించిన ఆస్తినంతా లావణ్యకు సంక్రమించేలా చేసి వెళ్ళి- పోయారు తానూ గుంటూరు వస్తానంటే వద్దనలేదు రాగులు పైపెచ్చు సంతోషించాడు

గుంటూరులో లక్ష్మీపురంలో చక్కటి డాబా భవనం విశాలమైన ప్రాంగణం అందులో తీర్చి దిద్దినట్లున్న తోట రక రకాల పూల మొక్కలు కన్నుల పండువు చేస్తున్నాయి

పుష్ప సుగందం నాసా పుటాల్లో ప్రవేశించి మామూలు వ్యక్తుల్నే మత్తెక్కిస్తుంది డాబాలో తన రక రకాల చిత్రాల్ని కళాత్మకంగా అమర్చిపెట్టాడు రాగుల ఒక పక్కగా లావణ్య శిక్షణ పొందుతూ చిత్రించిన చిత్రాలున్నాయి హాలుకు ఒక పక్క పడక గది దాన్నానుకొని డ్రెస్సింగు రూమ్ మరో ప్రక్క చిత్ర కళకు సంబంధించిన సామగ్రితో నిండిన గది హాల్లో ఒక మూలగా చిత్రాలు చిత్రించ- డానికి కేన్వాసు అమర్చిన బోర్డు రంగులు కుంచెలు మొదలైన చిత్ర కళా సంబంధి సామగ్రి ఏర్పరచిన బల్లలు, ఎదురుగుండా 'మోడల్ ఉండడానికి తగిన వేదిక అన్ని ఏర్పాట్లు కళాత్మకంగా చేయబడి ఉన్నాయి అందులో ప్రవేశించిన వాళ్ళెవరైన ఆ వున్నంతసేపు ఒక కళా జగత్తులో విహరిస్తున్నట్టే అనుభూతిని పొందుతారు అందరినీ ఆకర్షించే రెండు కళా ఖండాలు ఒకటి లంబాడీ లతాంగి, రెండు ముసలిది

ఈ రెండు తైల వర్ణ చిత్రాలు స్కెచ్ గీయడంలో వాటర్ కలర్ సమ్మేళనం చేయడంలో తైల వర్ణాల్ని తీర్చి దిద్దడంలో రాగులకు రాగులే సాటి అనంత కళా విజ్ఞాన ఖని రాగుల

రాగుల తల్లి ప్రేమకు నోచుకోలేదు తన జననమూ, తల్లి మరణమూ ఒకేసారి జరిగి- పోయాయి తన బాల్యంలోనే తండ్రి గతించగా తాత పెంచి పెద్ద చేశాడు అలా పెరిగిన తనకు 'శకుంతల అంటే ప్రత్యేకమైన అబిమానం శకుంతల పేరెత్తితే తన హృదయం ద్రవిస్తుంది ముగ్ధ సుకుమార అయిన శకుంత తపో వనంలో చెలికత్తెలతో మొక్కలకు నీళ్ళు పోస్తున్న చిత్రాన్ని చిత్రించాలని ఎంతో కాలంగా ఆశిస్తూ వచ్చాడు ఈనాడు 'చిత్రా బహూతి' కోసం ఆ చిత్రం చిత్రించాలని సంకల్పిం- చాడు తగిన మోడల్ లావణ్య వుంది గనుక తన కోరిక సిద్ధిస్తుందని తప్పక, తన పేరు మరోసారి మార్మోగిపోతుందనీ బావించాడు చిత్ర రచనకు సర్వం సిద్ధం చేసుకొన్నాడు మోడల్'గా శకుంతల వేషంలో లావణ్య డ్రెస్సింగ్ రూమ్‌లో నుంచి ప్రత్యక్ష- మైంది ఆ ముగ్ధ మోహనాకార, అతిలోక లావణ్య లావణ్యను చూచిన రాగుల హృదయం రాగ రజిత- మైంది ఎంత మంది యువతుల్ని చూడలేదు తాను పై పెచ్చు మోడల్‌గా లావణ్య కొంత కాలంగా ఉంటూ వచ్చిందే? అయినా ఈనాడు ఎందుకింతగా తన హృదయం అకృష్టమయిందా అని తలచే అవ- కాశమే లేకుండా పోయింది తానూహించిన శకుంతలలో ఉండవలసిన మరి కొన్ని చిహ్నాల్ని లావణ్యకు దిద్ది తీర్చే పనిలో నిమగ్నుడయ్యాడు కానీ తన మనసు మాత్రం తన వశంలో లేదు అనంతానురాగ లోకాల్లో విహరిస్తుంది లావణ్య- వన్నె చిన్నెలు సవరిస్తూ రసానుభూతికి లోనై- పోయాడు ఇది కేవలం శారీరక వాంఛ హేతువు అనడానికి వీలు లేదు ఆ స్థితిలో ఆతని మనస్సు లావణ్యపై సంలగ్నమైంది లావణ్య చేతుల్ని తన చేతుల్లోకి తీసుకొన్నాడు కాదనలేదు లావణ్య బిగియార కౌగలించుకొన్నాడు అడ్డు చెప్పలేదు పువ్వు వలె కరిగిపోయింది ముద్దుల వర్షం కురిపిం- చాడు మురిసిపోయింది పారవశ్యంలో పరమా- నందానుబూతిని పొందింది పడక గదిలోకి నడిచాడు కాదన లేదు తాను అనసరించింది అంతరాంతరాల్లో ఇది 'మొదటి రాత్రి అన్న అనుబూతి మెదిలింది అనంత స్వర్గ సౌఖ్యానుబూతి పొందిన రాగుల తన ఆరాధ్య దేవత' అంటూ లావణ్య ఒడిలో ఒదిగిపోయి అర్ధ నిమీలిత నేత్రుడై- నిద్రలోకి జారిపోయాడు రాగులని నిద్రబుచ్చి హాల్లోకి వచ్చి చిత్ర రచనలో నిమగ్నురాలైంది లావణ్య

చిత్ర బహుమతి పోటీ ఫలితాలు ప్రకటించ- బడ్డాయి కళాపిపాసువులు ఆశించిన రీతిగా బహుమతి ఆర్ ఆర్ రాగులకి రాలేదు ఇంత వరకూ ఎవరూ వినని పేరు బహుమతి గ్రహించిన చిత్రకారిణి శ్రీమతి లావణ్యారాగుల బహుమతి గెల్చుకున్న చిత్రం 'మొదటి రాత్రి' అందరూ ఆశ్చర్య సముద్రంలో మునిగిపోయారు □